

గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోటయ్య



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చందమామల కోటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో శుక్రవారం గౌరవ అధ్యక్షుడు వి.వి.వినాయక్ ఆధ్వర్యంలో గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడుగా రామారావు, ఉపా ధ్యక్షుడిగా కోటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోట య్య మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలనీ, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించి, ప్రజలపై భారాలు మోపే విధానాన్ని వ్యతిరేకించాలని శుక్రవారం సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కమిటీ తీర్మానించడం జరిగింది. జిల్లా కమిటీ సమావేశానికి హాజరైన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి. రమాదేవి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ జగన్ సర్కారు పోయి, బాబు ప్రభుత్వం వచ్చినా విద్యుత్ షాక్‌లు మాత్రం ఆగడం లేదని విమర్శించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో రకరకాల పేరతో భారాలు మోపోడంతో ప్రజలు ఇంటికి పంపారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా ప్రజలపై 15వేల కోట్ల రూపాయలు విద్యుత్ భారాలు మోపిందని తెలిపారు. ఆదాని సఖి సోలార్ విద్యుత్ ఒప్పందంపై వైసీపీ ప్రభుత్వం తప్పు దోవ పట్టిస్తున్నదని ప్రతిపక్షంలో ఉండగా నేటి ఆర్థిక శాఖ మాత్యులు పయ్యావుల కేశవ్ విమర్శించారని, నేడు అదే దోవలో కూటమి ప్రభుత్వం పయనిస్తుందని విమర్శించారు. మొదటి దశలో వ్యవసాయ రంగంలో మీటర్లు బిగించి నేడు ఇళ్లకుకూడా బిగించే కార్యక్రమం చేపట్టారని, ఎక్కడికక్కడ ప్రజలు ఈ మీటర్లు బిగించే విధానాన్ని ఎదుర్కోవాల పిలుపునిచ్చారు. ఈ అదాని మీటర్ల వల్ల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున భారాలు పడతాయన్నారు. రాష్ట్రంలో పాఠశాలల విలీనాన్ని ఎక్కడికక్కడ ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లయ్య, టి.సుబ్రహ్మణ్యం, జనార్ధన్, జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర, సాయిలక్ష్మి, వేణుగోపాల్, మాధవ్, లక్ష్మి, రవి, వెంకటేష్, శివకుమార్‌లు పాల్గొన్నారు.

కందారపు మురళికి మాతృవియోగం



కందారపు రాజమ్మ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం సీనియర్ నేత కందారపు మురళికి మాతృవియోగం కలిగింది. కందారపు రాజమ్మ (82) స్విమ్స్ ఆసుపత్రిలో గత వారం రోజులుగా చికిత్స పొందుతూ, శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు కన్ను మూశారు. ఆమెకు కందారపు మురళితో పాటు మొత్తం నలుగురు పిల్లలు ఉన్నారు. వృద్ధాప్య సమస్యలతో పాటు మెదడులో బ్లీడింగ్ ఏర్పడడంతో వారం రోజులుగా స్విమ్స్ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం కరకంబాడి రోడ్డులోని గోవింద ధామంలో జరుగుతాయని కందారపు తెలిపారు.

నేత్రదానం..

తమ తల్లి కందారపు రాజమ్మ నేత్రాలను రుయా ఆసుపత్రి 'ఐ' బ్యాంకుకు దానం చేసినట్లు సిపిఎం నేత కందారపు మురళి తెలిపారు.

కందారపు రాజమ్మకు పలువురు నివాళులు

కందారపు రాజమ్మ మృతిపట్ల సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి, సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, తిరుపతి జిల్లా సిపిఎం కార్యదర్శి వి నాగరాజు, చిత్తూరు జిల్లా సిపిఎం కన్వీనర్ వి గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, డి జనార్ధన్, జిల్లా కమిటి సభ్యులు, సిపిఎం తిరుపతి నగర శ్రేణులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, టిడిపి ,జనసేన, వైఎస్ఆర్సిపి పార్టీ నేతలు రాజమ్మకు నివాళు లర్పించారు.

రేణిగుంట సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ సంతాపం

ప్రజాశక్తి - రేణిగుంట: కందారపు రాజమ్మ మృతి పట్ల, రేణిగుంట సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ ద్వారా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ.. కందారపు మురళి తల్లి మరణించిన వార్త వినగానే దిగ్భ్రాంతికి గురయ్యామని, తల్లిని పోగొట్టుకొని బాధలో ఉన్న వారికి, వారి కుటుంబ సభ్యులకు రేణిగుంట సిపిఎం పార్టీ ద్వారా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామని పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. రేపు శనివారం ఉదయం తిరుపతి యశోద నగర్ లోని సిపిఎం కార్యాలయం దగ్గర ఉన్న ఇంటి వద్ద అంత్యక్రియలు జరుపుతున్నందున సిపిఎం పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, కార్మిక సంఘాలు, యూనియన్ నాయకులు అందరూ ఈ అంత్యక్రియల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



ప్రముఖులు సంతాపం

కందారపు రాజమ్మకు నివాళులర్పిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి

శ్రీవారి సేవల సంస్కరణపై టీటీడీ ఈవో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అడిషినల్ ఈవో వెంకయ్య చౌదరి తదితరులు

ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి సేవ స్వచ్ఛంద వ్యవస్థలో తీసుకురానున్న సంస్కరణలపై టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభించనున్న ప్రొఫెషనల్ శ్రీవారి సేవ, ఎన్ఆర్ఐ సేవ, గ్రూప్ సూపర్వైజర్ల సేవల కార్యాచరణ పురోగతి గురించి చర్చించారు. ఐఐఎం-అహ్మదాబాద్ బృందంచే గ్రూప్ సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చేందుకు కార్యా చరణ రూపొందించాలని ఈఓ అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు శ్రీవారి సేవను ఉన్నతంగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాల న్నారు. ఐ.టి డిపార్ట్మెంట్ పవర్ పాయింట్ ద్వారా గ్రూప్ సూపెర్వైసర్ కొరకు రూపొందించిన అప్లికేషన్‌ను చూపించారు. అదే విధంగా ఎన్ఆర్ఐ సేవ, ప్రొఫెషనల్ సేవలను కూడా త్వరిత గతిన ప్రారంభించాలని, ఎన్.ఆర్.ఐ సేవలను విస్తరించేందుకు ఏ. పి.ఎన్.ఆర్.టి సంస్థతో సంప్రదింపులు చేయాలని శ్రీవారి సేవ అధికారులను ఈఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ పోర్ట్, ఐ.టి జీఎం శేషారెడ్డి, సీపీఆర్వో డా.టీ.రవి, అశ్వినీ ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమ కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భద్రతా ప్రణాళికలపై ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులతో సమావేశం

భక్తుల సౌకర్యార్థం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తిరుమలలో భద్రతా ప్రణాళికలపై ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులతో టీటీడీ ఈవో జే.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. అలిపిరి తనిఖీ కేంద్రం ఆధునీకరణ, అధిక సామర్థ్యం కలిగిన స్కానర్లు, త్వరితగతిన తనిఖీలు పూర్తయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పార్కింగ్ మేనేజ్మెంట్, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటిగ్రాటెడ్ సర్వేలన్స్ సిస్టం, కామన్ అలారం మానేజ్మెంట్ సిస్టం, ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ వ్యవస్థ, నో హెల్మెట్ డిటెక్షన్, ఆటోమెటిక్ ట్రాఫిక్ కంట్రోల్ %ఁ% క్లారిఫికేషన్, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ వంటి అంశాలను ఈవోకు వివరించారు. ఈ కార్యక్రమం లో సీవీఎస్వో మురళీకృష్ణ, సిఈ సత్య నారాయణ, ఎల్ అండ్ టి ప్రతినిధుల నిపుణుల బృందం, ట్రాన్స్ పోర్ట్, ఐ.టి జీఎం. శేషారెడ్డి, ఏఎస్పీ రామకృష్ణ, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, సదా లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పురోగతిపై విభాగాల వారిగా సమీక్ష

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై విభాగాలవారిగా అధికారులతో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిలో ఎస్ఎస్‌డీ కౌంటర్ల నిర్వహణ, అన్నప్రసాదం విభాగం ఆధునీకరణ, పరకామణి నిర్వహణ, పారిశుద్ధ్యం, టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా బాలాజీ నగర్ గృహాల పరిశీలన, కాలిబాట మార్గాలలోని దుకాణాల తనిఖీలు, యాత్రికుల వసతి సముదాయాల్లో కేంద్రీకృత లాకర్ కేటాయింపు వ్యవస్థ, ఎఫ్ఎంఎస్ మొబైల్ యాప్ వినియోగం, తిరుమలలో ల్యాండ్‌స్కేప్ సర్వే, కొత్తగా రూపొందిస్తున్న కాటేజ్ డొనేషన్ పాలసీ, సీఆర్వో పునర్నిర్మాణం వంటి అంశాలపై వివరంగా చర్చించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు నిర్దేశిత సమయంలోపు తమకు కేటాయించిన పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పి-4తో సామాజిక అభివృద్ధికి ముందడుగు

- 5 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి-4 కార్యక్రమం కింద జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ 5 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని తన బాధ్యతను చాటుకున్నారు. శుక్రవారం ఆయన తిరుపతి, తిరుచానూరు సమీపంలో గల నక్కల కాలనీకి చెందిన నాలుగు కుటుంబాలను, దామినేడుకు చెందిన 1 కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. బంగారు కుటుంబాల వివరాలు: ఎస్. సావిత్రమ్మ, ఏలుమలై కుటుంబం, వేదవల్లి, విజయశాంతి, విష్ణు అనిత, గంగోత్రి, బాబు కుటుంబం, అంబికా, నందు, వీరభద్ర, చిన్నతంబి కుటుంబం, బలరాం, అనిత, కర్ప స్వామి, గాంధీ, శాంతి కుటుంబం, దామినేడుకు చెందిన విజయశాంతి, బాబు, ధనుష్, యోగి కుటుంబం. కలెక్టర్ ఈ కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలలో పునాదులు ఏర్పడేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

మఠం భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న ఆక్రమణదారులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, మంగళం: తిరుపతి డివిజన్ పరిధిలోని తిరుపతి గ్రామీణ మండలం, తిరుపతి అర్బన్ మండలాలలో ఉన్న హథీరాంజీ మఠం, పరకాల స్వామి మఠం భూములను దౌర్జన్యంగా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. శుక్రవారం తిరుపతి రూరల్, అర్బన్ మండలాల పరిధిలోని సర్వే నంబర్లు 145, 147లో ఉన్న హథీరాంజీ మఠం, పరకాల స్వామి మఠం భూములను కొందరు ఆక్రమించే నిర్మాణాలు వెంటనే ఆ నిర్మాణాలను తొలగించాలని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ సర్వే నంబర్145, 147 లు హథీరాంజీ, పరకాల మఠానికి సంబంధించి వివాదంకు సంబంధించి హైకోర్టులో స్టేటస్కో విధించడం జరిగిందన్నారు. ఈ స్టేటస్కోను ఉల్లంఘించి పరకాల స్వామి మఠం ద్వారా పొందిన నరసింహారెడ్డి అతని తరపు కొందరు వ్యక్తులు కోర్టు ధిక్కారానికి పాల్పడి కోర్టు ఉత్తర్వులను లెక్కచేయకుండా సదరు స్థలంలో నిర్మాణాలు చేపట్టడంతో సమాచారం అందుకున్న శ్రీ స్వామి హథీరాంజీ మఠం పరిపాలన అధికారి, ఆర్డిఓ, తిరుపతి రూరల్ మండలం తహశీల్దార్ రామాంజనేయులు నాయక్, చంద్రగిరి డిఎస్పి ప్రసాద్, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిని అడ్డుకొన్నారు. అవిలాల గ్రామంలోని సర్వే నంబర్ 146 లో వాగు పోరంబోకు హథీరాంజీ మఠం భూమిని ఆనుకుని ఉందని, ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చిన ఎటువంటి స్పందన లేకపోవడంతో వాటిని తొలగించామన్నారు. తొలగింపు సమయంలో చేత మాధవ్ అనే వ్యక్తి ఇతరులతో కలిసి తహశీల్దార్‌ను అడ్డుకొని వారు చెబుతున్న భూమి ఇది కాదని నచ్చజెప్పే ప్రయత్నం చేసిన వారు వినిపించుకోలేదని, ఎంతటి వ్యక్తులైన నీటి వనరుల ప్రాంతాలను ఆక్రమిస్తే సహించమని కలెక్టర్ హెచ్చరించారు.

ఈఎస్ఐలో స్ప్రీ 2025 పై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ఈఎస్ఐ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్ప్రీ 2025 అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈఎస్ఐ కార్పొరేషన్ సంయుక్త సంచాలకులు రాధాకృష్ణ మాట్లాడుతూ స్ప్రీ ఎస్ఐసి సంస్థలు, ఉద్యోగులను ఈఎస్ఐ పథకంలో చేరడానికి దోహదపడుతుందన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత, సంక్షేమాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ అధికారులు, వైద్యులు, కార్మికులు పాల్గొన్నారు.

20న తిరుపతిలో ఓపెన్ చెస్ టోర్నమెంట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, టౌన్: 20 వ తేదీ ప్రపంచ చదరంగ దినోత్సవం సందర్భంగా, తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎస్‌వి మెడికల్ కాలేజీలో తిరుపతి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తుడా చైర్మన్, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాలర్స్ దివాకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో తిరుపతి జిల్లాకు చెందిన క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు, అన్ని వయసుల స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చునని తెలియజేశారు. విద్యార్థులు ప్రతిరోజు చెస్ ఆడడం వలన తెలివితేటలు పెరగతాయన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో చర్చించి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చెస్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, బాలాజి చౌదరీ, శ్రీనివాస సూరి, వెంకట్, అనిల్ పాల్గొన్నారు.

టిటిడిలో వెయ్యి మంది హిందూయేతరులు

- టిటిడి బోర్డుకు అప్రమత్తత అవసరం
- పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారి దర్శనం

: కేంద్ర మంత్రి బండి సంజయ్



ప్రజాశక్తి - తిరుమల: టిటిడీలో హిందుయేతరుల ఉద్యోగుల నియామకంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టీటీడీలో వెయ్యి మందికి పైగా హిందుయేతరులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఈ ఆనవాయితీని ఎందుకు కొనసాగిస్తున్నారని నిలదీశారు. హిందుయేతరులను వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. హిందుయేతరులు టీటీడీలో పనిచేస్తున్నందువల్లే ఆచార వ్యవహారాల్లో తేడా వస్తోందని ఆరోపించారు. హిందుయేతరుల నియామకం హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై టీటీడీ పాలకమండలి, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

బండి సంజయ్‌కు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ జన్మదిన శుభాకాంక్షలు



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం తిరుపతికి వచ్చిన కేంద్ర మంత్రిని హరిప్రసాద్ కలిసి హస్తకళలను ప్రోత్సహించే విధంగా కొండపల్లి దశావతార విగ్రహాల జ్ఞాపికతో పాటు కలంకారి శాలువాను బహూకరించారు.

ప్రపంచ జనాభా దినోత్సవం.. అవగాహనా ర్యాలీ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భముగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలక్రిష్ణ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 11 వ తేదీన "ప్రపంచ జనాభా దినోత్సవం" జరుపుకొంటున్నామని, అందులో భాగంగా ఈ సంవత్సరం ప్రణాలికా బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం" అను నినాదంతో అవగాహన కార్యక్రమాలు జిల్లా అంతటా నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాస రావు, డిప్యూటి డి ఎమ్ హెచ్ ఓలు డాక్టర్ సెల్వియా, డాక్టర్ శ్రీని వాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్‌తో ఇంటివద్దే సేవలు



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ రఘువంశీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పురమిత్ర యాప్‌తో మీ ఇంటివద్దే సేవలు పొందవచ్చునని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. శుక్రవారం నగరంలోని తిరుమల రెడ్డి నగర్ వార్డుల్లో ఇంటింటి సర్వే ను కమిషనర్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది త్వరగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన పురమిత్ర యాప్‌ను ప్రజలందరూ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల మద్దతు వైసిపికే : నేదురుమల్లి



ప్రజాశక్తి - వాకాడు : కూటమి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ ప్రజల మద్దతు వైసిపికే ఉందని వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వాకాడులోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. జగన్ పర్యటన అంటే కూటమి ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని పర్యటనకు ఆటంకాలు కలిగిస్తున్నారని తెలిపారు. అమ్మ ఒడి, ఫీజు రియంబర్స్‌మెంట్ వైసిపీ పాలనలో సక్రమంగా జరిగాయని, కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నేదురుమల్లి హిమకుమార్ రెడ్డి, వాకాడు ఉపసర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, కోట వాకాడు పట్టణాధ్యక్షుడు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, నార్త్ సెక్షన్ , దామినేడు సెక్షన్, ఈస్ట్ సెక్షన్, సౌత్ సెక్షన్, మంగళం సెక్షన్, ఆటోనగర్ సెక్షన్, రాజీవ్ నగర్ సెక్షన్ ల్లో 33 /11 కె వి. పోస్టల్ కాలని, దామినేడు ఫీడర్ , 33 /11 కె.వి. ఇస్కాన్ ఎస్.ఎస్ లో నీ కె.వి. అలిపిరి ఫీడర్ భవానీ నగర్, 33/ 11 కె.వి క్రాంతి నగర్, ఫీడర్లకి సంబంధించి విద్యుత్ మరమ్మత్తులు, ట్రీ కటింగ్ కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల జరుగుతుందని ఈఈ చంద్రశేఖర రావు ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ ఏఈ భాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ నిర్వహణ పనులు, చెట్లు కత్తిరింపు వంటి కారణాలతో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

హాస్టల్‌కు సొంత భవనం ఏర్పాటు చేయాలి



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బీసీ బాలుర హాస్టల్‌కు సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద పుత్తూరు బీసీ విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్ మాట్లాడుతూ పుత్తూరు బీసీ బాయ్స్ హాస్టల్ 16 సంవత్సరాలుగా ప్రైవేట్ బిల్డింగ్‌లో మార్చుకుంటూ వెళ్తున్నారన్నారు. హాస్టల్‌లో ఉంటున్న 120 మంది విద్యార్థులు మౌలిక వసతు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. భవనం యాజమానులు ఉన్నట్టుండి ఖాళీ చేయమంటున్నారని, విద్యార్థులు ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హాస్టల్ విద్యార్థులు దాము, ఉమేష్, వినయ్, మహేష్, బాలు, ఓబు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి వివాహ ఆహ్వానం



ఆహ్వాన పత్రిక ఇస్తున్న సుద్దాల రాజు యాదవ్

ప్రజాశక్తి - తిరుమల: అమరావతి సిఎం క్యాంప్ ఆఫీసులో సీఎం చంద్రబాబు నాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌లను మర్యాదపూర్వకంగా కలిసి, ఈ నెల 31న జరగబోయే భరత్ యాదవ్ వివాహనికి విచ్చేసి ఆశీర్వదించాలని తిరుమల టిడిపి పట్టణాధ్యక్షుడు సుద్దాల రాజు యాదవ్ ఆహ్వానించారు.

ఉచిత అంబులెన్స్‌లు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాజాష్ ఆచ్చారి, జేఎంసి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు ఉచిత అంబులెన్స్‌లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం శ్రీ పద్మావతి మెడికల్ కళాశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో దూరం నుంచి స్విమ్స్‌కు వచ్చే పేదలు అంబులెన్స్ వినియోగానికి వేల రూపాయలు చెల్లించ లేక ఇబ్బంది పడుతుండటంతో జనసేనాని పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో రాజేష్ ఆచ్చారి బృందం, జేఎంసి ట్రస్ట్ ఉచిత అంబులెన్స్‌లు ప్రారంభించాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు.


ఘనంగా బృందమ్మ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ జన్మదిన వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. పలువురు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పెళ్లి మండపం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే పాశిం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తిప్పవరపాడు, కందలి గ్రామాల్లో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందచేశారు. తిప్పవరప్పాడులో సి.సి రోడ్‌ను ప్రారంభించారు. ఈ కార్యమంలో టీడీపీ నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర రాజు, మట్టం శ్రావణి రెడ్డి, దుద్దా రాఘవ రెడ్డి, యారమాపు హేమ కుమార్ రెడ్డి, హనుమాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షులుగా సుధాకర్ రెడ్డి



ప్రజాశక్తి - రామచంద్రాపురం: వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులుగా రేఖలచేనుకు చెందిన పసపల సుధాకర్ రెడ్డి నియమిస్తూ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం నుంచి లీగల్ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డిలకి, మండల స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయం.. లాభదాయకం



ప్రజాశక్తి - తొట్టంబేడు: మండలంలోని రైతులు యాంత్రీకరణకు అలవాటుపడి సాంప్రదాయ సేద్యానికి స్వస్తి పలుకుతున్నారు. దీంతో రైతులకు చేదోడు వాదోడుగా ఉండే కాడెద్దులు కనిపించడం లేదు. యంత్రాలతో పనులు నిర్వహించడం ద్వారా తక్కువ సమయంలో వ్యవసాయ పనులు పూర్తి అవుతున్నప్పటికీ సాగు ఖర్చు విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు దుక్కి దున్నడం, సేంద్రియ ఎరువుల వాడటం, చెరువులో మట్టి పొలాలకు తరలించడం వంటి పనులు కాడెద్దులతో చేయించేవారు. ప్రస్తుతం యంత్ర పరికరాలను ఉపయోగిస్తున్నారు. కొంతమంది రైతులు వ్యవసాయానికి స్వస్తి పలికి ఇతర రంగాలను ఆశ్రయిస్తున్నారు. పంటలకు సేంద్రియ ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించి, రసాయన ఎరువుల మీద రైతులు పూర్తిగా ఆధారపడిపోయారు.

చెత్త నుండి సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

సేంద్రీయ వ్యవసాయం చేయటానికి రైతుల కోసం 2014 సంవత్సరం అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం చెత్త నుండి సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా రైతులకు సేంద్రియ ఎరువులు తక్కువ ధరలకే దొరికే అవకాశం కల్పించారు. అయితే పంచాయతీల్లో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాలు కొన్ని పంచాయితీలలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. ఈ కేంద్రాలను అధికారులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాగలిగితే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. సేంద్రియ వ్యవసాయం చేయడం వలన పొలంలోని సూక్ష్మజీవులను నిర్మూలించవచ్చు. దీని ద్వారా పురుగుల మందుల వాడకం తగ్గిపోతుంది. ఎలాంటి ఆర్థిక నష్టం లేకుండా పంట పొలాలను కాపాడుకోవచ్చు.

యాంత్రీకరణతో భూమికి నష్టమే

యాంత్రీకరణతో భూమిని దుక్కి దున్నేప్పుడు లోతుగా దున్నటంవలన నేల కోతకు గురవుతుంది. రైతులకు ఖర్చు భారం పెరుగుతుంది. భూమిలోని మూలాలు దెబ్బతింటాయి. రైతులు ఆర్థికంగా నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.



"రైతులు సేంద్రియ ఎరువుల పట్ల అవగాహన పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయం వలన భూమిలో సారం తగ్గిపోకుండా ఉండటమే కాకుండా మంచి దిగుబడులు వస్తాయి. భూమిలో సారం తగ్గితే రైతులు వారి పంట పొలాల్లో భూసారం తగ్గిందని అనుమానం వస్తే భూసారం పరీక్షలు చేయించడానికి అధికారులు అందుబాటు లోనే ఉంటారు.

- సురేందర్ రెడ్డి, వ్యవసాయ అధికారి

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రాపురం: విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నైపుణ్యతను పెంపొందించుకోవాలని జేఎన్ టీయూ - ఆయిల్ టెక్నాలాజికల్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వి. సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామాపురంలో ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో 4వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడతాయన్నారు. మైథిలి లైఫ్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ నైపుణ్యం ఉన్నవారికి రానున్న రోజుల్లో మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. కళశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిరంజన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. అనంతరం బి ఫార్మసీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ విభాగాధిపతులు, డైరెక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, పరీక్షల నియంత్రణ అధికారి సతీష్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

12 అర్ధరాత్రి నుండి సమ్మెలోకి..



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపుమేరకు మున్సిపల్ కార్మికులు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సి.ఐ.టి.యు జెండాలు చేత పట్టుకొని నినాదాలతో మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి ధారా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు అందరికీ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం వర్తింపచేయాలని తమ ఇతర డిమాండ్లను తీర్చాలని కోరారు. ప్రభుత్వం మంత్రివర్గంతో చర్చలు జరిపి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు, ఇంజనీరింగ్ కార్మికులకు, న్యాయం చేయవలసిందిగా కోరారు. తమ డిమాండ్లు తీర్చని పక్షంలో పక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 12వ తేదీ అర్ధరాత్రి నుండి సమ్మెలోకి వెళ్లడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం ఉపాధ్యక్షులు ఎన్. వెంకట రమణయ్య, సహాయ కార్యదర్శి సి. హెచ్.రాజేష్, గూడూరు పట్టణ సిఐటియు ప్రధాన కార్యదర్శి బి.వి రమణయ్య, అధ్యక్షులు పామంజి మణి, జి.శ్రీనివాసులు, ఆర్. ఆనంద్, ఎస్.శివ,ఎంబేటి చంద్రయ్య, శివరామయ్య, రాఘవ, వెంకట రమణయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఆదివారం ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని యూనియన్ నేతలు, కార్మికులు ఘనంగా నిర్వహించారు. డిపో గ్యారేజీ ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు జెండాలను చేతబట్టి ఆవిర్భావ దినోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈయూ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం రాజు మాట్లాడుతూ ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికుల సమక్షంలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు నారాయణ, చెంగయ్య, వి.ఎస్.రాజు, శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ పురోగతి వివరాలు పారదర్శంగా సేకరించాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: పంచాయతీ పురోగతి వివరాలను పారదర్శంగా సేకరించి ఆన్లైన్లో నమోదు చేయాలని బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో వెంకటరత్నమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ అడ్వాన్స్‌మెంట్ ఇండికేటర్ సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ ముని సుబ్రణ్యం, రవీంద్రనాథ్, వైద్యాధికారి మురళీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2022-23, 2023-24 సంవత్సరాలు సంబంధించి పంచాయతీ పురోగతిపై వివరాలను సేకరించాలన్నారు. సర్వే విధానాన్ని రిసోర్స్ పర్సన్ హేమంత్ కుమార్ వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మేత పోరంబోకు భూమిని గ్రామానికే కేటాయించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధి, మేకనూరులోని మేత పోరంబోకు భూమిని గ్రామానికే కేటాయించాలని గ్రామస్థులు గూడూరు తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కి శుక్రవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మేకనూరులో 240 ఎకరాల మేత పోరంబోకు భూమి ఉందని తెలిపారు. గ్రామంలో ఎక్కువ మంది గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, మేపుకొని జీవనం సాగిస్తున్నమన్నారు. జీవాలు మేపుకొనుటకు గ్రామానికి మేత పోరంబోకు భూమి తప్ప, ఇంక వేరే ఆధారం లేదని తెలిపారు. తమకు జీవనాధారమైన భూమిని ఏ ఫ్యాక్టరీకి అనుమతి ఇవ్వద్దని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు డిప్యూటీ తహశీల్దార్ చైతన్య, వెటర్నరీ ఏ.డి సురేష్, ఇంచార్జీ డిప్యూటీ ఎంపీడీవో రాము, వి.ఆర్వో చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఇటీవల ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా మండలానికి విచ్చేసిన ఉపాధ్యాయులకు సంబంధించి వేతనాల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ బి.ఎన్.కండ్రిగ మండల శాఖ అధ్యక్షులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి సమితి వెంకటేష్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రమణ్యంలకు ప్రాతినిధ్యం చేశారు. ఈ సందర్భంగా వారు మండలంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులకు సంబంధించి ఎస్ఆర్‌లు నమోదు పూర్తి చేయాలని, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని, రాబోయే ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండల కేంద్రంలో నిర్వహించాలని తదితర అంశాలపై ప్రాతినిధ్యం చేయగా సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో అన్నింటికీ పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ నాయకులు యువశ్రీ మురళి, లక్ష్మయ్య, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: శుక్రవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, సమ్మె కాలపు ఒప్పందాలకు ఇవ్వాలని అక్రమాల రామారావుని బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్, కాసీపేట, రాజా వీధి, పాత బస్టాండ్, రాణి పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. రామారావును వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

పాకాల బస్టాండ్ పరిశీలన - ప్రజాశక్తి వార్తకు స్పందన



ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, పాకాల ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రైవేటు బస్సులు రాకపోకలపై జూలై 2 వ తారీఖున పాకాల ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలు అనే శీర్షికతో ప్రచురించిన వార్తకు స్పందించి, తిరుపతి జిల్లా ప్రజా రవాణాశాఖ తిరుపతి రీజినల్ మేనేజర్ జగదీష్, అధికారులు శుక్రవారం పరిశీలించారు. పాకాల ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలను అనుమతించరాదని, ప్రయాణికులకు, ఆర్టీసీ బస్సు సర్వీస్‌లకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. పాకాల బస్టాండ్ లోని బస్సు సర్వీసుల రూట్ చాట్ ను పరిశీలించి, పాకాల ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ రవిచంద్రను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న షాపులకు నోటీసులు ఇచ్చి, లైసెన్స్ క్యాన్సల్ చేయాలని ఆదేశించారు. బస్టాండ్ ఆవరణములో ఏర్పాటుచేసిన తాగునీటి సౌకర్యాలను, మరుగుదొడ్లను పరిశీలించి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పాకాల బస్టాండ్ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేయాలని, బస్టాండ్‌లో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

మంగళం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం: పులివర్తి నాని



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం ప్రాంతాన్ని వేగంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నామని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని పేర్కొన్నారు. శుక్రవారం మంగళం పరిధిలోని మంగళం-2 గ్రామపంచాయతీ బిటిఆర్ పురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలతో ఏడాది పాలన వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, మండల మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెరుగు భాస్కర్ రెడ్డి, గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షులు సురేష్ నాయుడు, ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, గ్రామ కమిటీ మహిళా అధ్యక్షురాలు జానకి, ఈశ్వరయ్య, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గోవిందరాజులు, చంద్ర, ఢిల్లీబాబు, రమేష్, మాతయ్య, పట్టాభి, అనసూయ, గోపాల్ యాదవ్, సుబ్బు యాదవ్, అల్లాబాషా తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

బెల్టు షాపు నిర్వాహకుడు అరెస్టు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని పాత సాయిరాం థియేటర్ వద్ద కూల్ డ్రింక్ షాప్ ముసుగులో బెల్ట్ దుకాణాన్ని నిర్వహిస్తున్న వ్యక్తిని శుక్రవారం వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతను వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ గోపి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్.. వ్యక్తి మృతి



ప్రజాశక్తి - రామచంద్రా పురం (చంద్రగిరి) చంద్రగిరి మండలం, కళ్యాణి డాం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని టమోట వ్యాన్ ఢీకొనడంతో హెరిటేజ్ పాల సేకరణ విభాగంలో పనిచేస్తున్న సూపర్ వైజర్ మహబూబ్ భాష (59) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కొద్ది నెలలలో పదవీ విరమణ చేయబోతున్న బాకరాపేటలో కాపురం ఉంటూ కాశి పెంట్ల హెరిటేజ్ డైరీలో పాల సేకరణ విభాగంలో మేనేజర్‌గా పనిచేస్తున్న మహబూబ్ భాష తన విధులను ముగించుకొని ద్విచక్ర వాహనంలో కాశిపెంట్ల నుండి స్వగ్రామం బాకరాపేటకు బయలుదేరాడు. మార్గమధ్యమం భాకరాపేట ఘాట్ కళ్యాణి డాం సమీపంలో భాకరాపేట నుండి తిరుపతి వైపు వస్తున్న టమేటా వ్యాను అతివేగంగా వచ్చి మహబూబ్ భాష ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా ద్విచక్ర వాహనం, టమేటా ట్రేలు భాషాపై పడి తీవ్ర గాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ అనిత సిబ్బందితో సంఘటన స్థలం చేరుకుని శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి వైద్య కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహబూబ్ బాషాకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని స్థానికుల సమాచారం.

స్పర్స్ విధానంలో నేరుగా ఖాతాల్లోకి నిధుల బదిలీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ద్వారా తిరుపతి జిల్లా పరిధిలో నిర్మించిన నీటి తొట్టెలు, గోకులాలు, సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు వంటి నిర్మాణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్పర్స్ విధానం ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభించిందని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. స్పర్స్ విధానం ద్వారా తిరుపతి జిల్లా పరిధిలో మొట్టమొదటిసారిగా గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.40 కోట్లకు పైగా నిధులు నేరుగా లబ్ధిదారులు, వెండార్స్ ఖాతాలకు జమైనట్లుగా చెప్పారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.100 కోట్ల రూపాయలు నిధులు రావాల్సి ఉండడంతో అందులో రూ.40 కోట్లకు పైగా నిధులు మంగళవారం విడుదల చేసినట్లుగా చెప్పారు.

లోతువానిగుంట సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని లోతువానిగుంట ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం నాయుడుపేట మున్సిపాలిటీలోని భూపయ్య కాలనీ, బీడీ కాలనీ, లోతువాని గుంట ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు,అందించిన సంక్షేమ ఫలాల వివరాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జనాభా నాణ్యత, ఆర్థిక అభివృద్ధి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ జనాభా 8.2 బిలియన్‌కు చేరుకుందని, ఇండియా జనాభా 146 కోట్లకి, ఆంధ్రప్రదేశ్ జనాభా 5 కోట్ల 34 లక్షల 48 వేలకు చేరుకుందని తెలిపారు. మానవ వనరులను సక్రమంగా వినియోగించుకుంటే దేశాభివృద్ధి జరుగుతుందని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు వై. శ్రీనివాసులు, అధ్యాపకులు శ్రీధర్ శర్మ, కిరణ్మయి, డాక్టర్ శైలజ, డాక్టర్ ఝాన్సీ వాణి, కృపా కరుణ వాణి, భీమవరపు లక్ష్మి, రవి రాజు, హిమబిందు, గోపాల్, జనార్ధన్, శైలజ, శ్రీలత, ఉష, సుందరమ్మ తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు డిగ్రీ కళాశాలలో..



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలను సమస్యగా చూడరాదని మానవ వనరులను సద్వినియోగం చేసుకుంటే అధిక జనాభా దేశాభివృద్ధికి ఉపయోగపడుతుందని డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి.నరసింహులు, డాక్టర్ పి.వరలక్ష్మి, బాబురావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజన, సావిత్రి తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.


తిరుపతి పద్మావతి కళాశాలలో..

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ కమ్యూనిటి మెడిసిన్ విభాగం, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ. కె.జి. కళాశాల, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పి.జి. కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వి కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రపంచ జనాభాలో పెరుగుతున్న సవాళ్లు, ప్రభావాలపై అవగాహన పెంచడానికి ఉద్దేశించిన కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో..

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో శుక్రవారం జనాభా విద్య విభాగంలో ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ జనాభా విద్య విభాగాధిపతి ప్రొఫెసర్ సాయి సుజాత మాట్లాడుతూ అధిక జనాభా వనరుల రూపకల్పన యువత జనాభా ప్రాధాన్యత వృద్ధాప్య జనాభా పోషణ గురించి తెలిపారు. విచ్చేసిన అతిధులు మాట్లాడుతూ అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలు కుటుంబ వ్యవస్థల విచిన్నాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకియాట్రిస్ట్ ఓ.వి.రెడ్డి, జనాభా విద్య విభాగం అకడమిక్ కన్సల్టెంట్స్ సునీల్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు సన్మానం



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: శుక్రవారం ఎమ్మార్వోగా బాధ్యతలు చేపట్టిన వెంకట నరసింహులును యానాదుల గిరిజన సంక్షేమ సంఘం, తిరుపతి జిల్లా అధ్యక్షులు, తలపల చెంచు మల్లికార్జున రావు, మాజీ గూడూరు డివిజన్ అట్రాసిటీ నెంబర్ మోపూరు అడివయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

స్క్రీన్ అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భారతీయ సినిమాలో కొత్త ప్రతిభను ప్రోత్సహించటమే లక్ష్యంగా మార్గదర్శక లాభాపేక్షలేని స్క్రీన్ అకాడమీని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ స్క్రీన్ ప్రారంభించినట్లు లోధా ఫౌండేషన్ వ్యవస్థాపక పోసికుడు అభిషేక్ లోదా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్స్, ఆస్కార్ విజేతలు, గునీత్ మోంగా, పాయల్ కపాడియా , రెసుల్ పూకుట్టి, ప్రముఖ స్క్రీన్ రైటర్ అంజుమ్ రాజబలి వంటి వారు మార్గదర్శకులుగా తమ సేవలను అందిస్తున్న ఈ అకాడమీ, భారతదేశంలోని అగ్రశ్రేణి చలనచిత్ర సంస్థలతో కలిసి పనిచేస్తుందన్నారు. చలనచిత్ర పాఠశాలలు నామినేట్ చేసిన విద్యార్థులకు ఏటా పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫెలోషిప్‌లను అందిస్తుందన్నారు. దరఖాస్తు ప్రక్రియ వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ .స్క్రీంఅకాడమీ. ఆర్గనైజషన్‌ని సంప్రదించాలని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హద్దు మీరితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నేర చరిత్ర ఉన్న వ్యక్తులు హద్దులు మీరి ప్రవర్తిస్తే తాట తీస్తామని శ్రీకాళహస్తి టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి హెచ్చరించారు. వీఎంపల్లి, ఎంఎంవాడ, మంచినీళ్ల గుంట ప్రాంతాలకు చెందిన పలువురు రౌడీషీటర్లకు శుక్రవారం స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ప్రవర్తనను మార్చుకోవాలని స్పష్టం చేశారు. మారకుంటే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు..?



ప్రజాశక్తి - క్యాంపస్ : పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్లు విడుదల చేయాలని, పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయం వద్ద మహాధర్నా కార్యక్రమంలో భాగంగా తిరుపతిలో వందలాది మంది విద్యార్థులతో కలెక్టరేట్ కార్యాలయం వద్ద శుక్రవారం మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మహేష్ ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా ఆఫీస్ బేరర్స్ కోగిలి ముని చందు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట శ్రీ పోలేరమ్మ హుండీ ఆదాయం రూ. 3,36,238



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు ద్వారా 3,36,238 రూపాయలు వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సుధీర్ బాబు తెలియజేశారు.పోలేరమ్మ ఆలయ చైర్మన్ నానబాల.సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి రవికృష్ణ, సిబ్బంది నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీవల్లి సమేత కుమారస్వామి ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఊరందూరులోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయంలో ఆడికృత్తిక మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. కాగా బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే స్వగృహంలో ఆవిష్కరించడం పై విమర్శలు వచ్చాయి. ఆలయ అధికారులు సాంప్రదాయాలను పక్కనపెట్టి అత్యుత్సాహం ప్రదర్శించారని భక్తులు, స్థానికులు మండిపడుతున్నారు.

ప్రశ్నించే గొంతుకలా కమ్యూనిస్టులు ఎదగాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:

తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం మార్క్స్ నగర్ 5వ శాఖ మహాసభకి రామ్మూర్తి అధ్యక్షతన జరిగినది. ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాధ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఎక్కడ ప్రజా సమస్య ఉంటే అక్కడ కమ్యూనిస్టు ప్రత్యక్షం అవ్వాలని ప్రశ్నించే గొంతుకల కమ్యూనిస్టులు ప్రజల్లో మమేకం కావాలని సిపిఐ శత వసంతాల స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని, సిపిఐ తిరుపతి జిల్లా 2వ మహాసభలు ఆగస్టు 3,4 తేదీలలో సూళ్ళురుపేటలో జరుగనున్నాయని జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ మాట్లాడుతూ సిపిఐ పోరాట ఫలితంగా తిరుపతి విస్తరించిందని 24 కాలనీలు నిర్మించిన ఘనత కమ్యూనిస్టులకి దక్కిందని అన్నారు. జూలై 18వ తేదీ జరిగే నగర మహాసభకు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన కమిటీని ప్రకటిస్తూ మార్క్స్ నగర్ శాఖ కార్యదర్శిగా కె రామ్మూర్తి, మల్లంగుంట శాఖ కార్యదర్శిగా వి. మునెమ్మ, సహాయ కార్యదర్శులుగా వై సూర్య, ప్రియ, జైపాల్ కమిటీ సభ్యులుగా ఏ.గోవిందరెడ్డి, ఆవనాక్షి, ఇంద్రాణి, మల్లీశ్వరి, చంద్ర చారి, కె.వెంకట్, రాజ్ కుమార్, ఆదిలక్ష్మి, పుండరీ, కిషోర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు డా.ఆర్. బలరాం, ఎన్. డి. రవి, కె. పద్మనాభ రెడ్డి, ఎం రామకృష్ణ, చిన్నం రత్నమ్మ, బండి చలపతి, ఉదయ్ కుమార్, డి.హెచ్ పి.ఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి నాగభూషణం, చిన్నం కాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ రూసా స్ట్రాటజిక్ సమీక్షా సమావేశం



ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ పథకం కింద జరుగుతున్న ప్రాజెక్టుల పురోగతిని అంచనా వేయడానికి ఒక వ్యూహాత్మక సమీక్షా సమావేశం శుక్రవారం యస్వీయు ఉపకులపతి ఛాంబర్‌లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్-ఛైర్మన్ ఆచార్య కె. రామమోహనరావు ఈ సమావేశానికి హాజరై విశ్వవిద్యాలయ అధికారులతో మాట్లాడారు. రూసా పనుల అమలును వేగవంతం చేయాలని విశ్వవిద్యాలయాన్ని కోరుతూ, రూసాను సంస్థ ప్రయోజనం కోసం పూర్తిగా ఉపయోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్వీయూ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్‌లు, సిఇఓ రూసా , సిబ్బంది, ఆర్థిక ,అభివృద్ధి విభాగాల కీలక అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి అనంతవీధి సర్కిల్‌లో లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస, లయన్ ఇంటెర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మెన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థికి కళాశాలలో చేరేందుకు 20,000/- ఫీజు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా సభ్యురాలు లయన్ శాంతి జన్మదినన్ని పురస్కరించుకొని సభ్యులందరు కలసి విద్యార్ధి చదువుకు ఆర్ధిక సాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు.

నేడు వేద విశ్వవిద్యాలయ 20వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : వేదముల సంరక్షణ, సాంప్రదాయ పద్ధతిలో వేద బోధన, పరిశోధన, ప్రచురణ, లుప్తమవుతున్నటువంటి వేద శాఖల పరిరక్షణే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 29/ 2006 యాక్ట్ ద్వారా ఏర్పడి విశ్వవిద్యాలయ గ్రాంట్ కమిషన్ద ద్వారా గుర్తింపబడి, టీటీడీ సంపూర్ణ సహకారంతో నడపబడుతున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 20వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు విశ్వవిద్యాలయ ఉప కులపతులు ఆచార్య రాణీ సదాశివ మూర్తి అధ్యక్షతన వేద విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గల సంధ్యావందన శాలలో శనివారం జరగనున్నాయి.

ఉపాధి కల్పనే కూటమి లక్ష్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమనీ, ఇందులో భాగంగానే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు నెలలకోసారి మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మెగా జాబ్ మేళాకి 11 బహుళ జాతీయ కంపెనీలు హాజరుకాగా, 154 మంది ఉద్యోగాలు పొందినట్లు ఆయన తెలిపారు.